క్లుప్తంగా

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజలు అందుకున్న సాయిబాబా

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలోని ఎన్జీవో కాలనీలో కొలువుదీరిన సాయిబాబా ఆలయ 19వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం సాయిబాబాకు ప్రత్యేక అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం హారతి, అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయిబాబా నామస్మరణంతో ఎన్జీవో కాలనీ మారుమోగింది. సాయంత్రం పల్లకీసేవ, భక్తి భజన సంస్కృతిక కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

మైసమ్మకు పూజలు



మైసమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల పరిధిలోని గోనె మైసమ్మ ఆలయం వద్ద ఆదివారం వనభోజనాలు నిర్వహించారు. శివ్వంపేట మండలంలోని దంతన్‌పల్లి గ్రామానికి చెందిన పద్మశాలి కులస్తులు వనభోజనాలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు జయరాములు, శివ్వంపేట మండలాధ్యక్షుడు భిక్షపతి, సంఘం నాయకులు నర్సింలు, రమేశ్, ఆంజనేయులు, వెంకటేష్, యాదగిరి, శ్రీనివాస్, కుల పెద్దలు ఉన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని గడి పెద్దాపూర్ గ్రామంలో దాసా ఆంజనేయ స్వామి మూడవ వార్షికోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి పూజలు చేశారు. ఈ వేడుకల్లో స్థానికులతో పాటు చుట్టూ పక్క గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు.

శబరిమల బయలుదేరిన అయ్యప్ప స్వాములు



కొడిపల్లి నుంచి శబరిమల యాత్రకు బయలుదేరిన అయ్యప్పస్వాములు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రానికి చెందిన పలువురు అయ్యప్పస్వాములు ఆదివారం శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. గురుస్వాములు మల్లేశ్‌గౌడ్, మల్లప్ప, కిషన్‌గౌడ్ ఆధ్వర్యంలో దీక్షలో ఉన్న అయ్యప్పస్వాములు ఇరుముడి ధరించి అభయ సీతారామాలయం, మల్లికార్జునస్వామి ఆలయంలో దేవతామూర్తులను దర్శించుకున్నారు. అనంతరం శబరిమల బయలుదేరారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు రాందాస్‌గౌడ్, శేఖర్, నరేశ్‌గౌడ్, కిరణ్‌గౌడ్, కొమురయ్య, వినయ్‌గౌడ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీ కొండాపూర్ గ్రామంలో క్రైస్తవ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్‌లు ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించి క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ నవీన్, పాస్టర్లు, క్రైస్తవ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ మండల కార్యకర్తల సమావేశం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో సోమవారం బీజేపీ మండల స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు మండలాధ్యక్షుడు భూపాల్ తెలిపారు. చేగుంట ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించే ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్ హాజరు కానున్నారు. మధ్యాహ్నం 1గంటలకు నిర్వహించే ఈకార్యక్రమానికి గ్రామాల బూత్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు ఇతర నాయకులు ఈ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముస్తాబైన సికింద్లాపూర్

- నేటి నుంచి లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు
- ప్రతీ ఆదివారం జాతర



కొనేరు పక్కన ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం



కొలువైన లక్ష్మీనర్సింహస్వామి

శివ్వంపేట(నర్సాపూర్): జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 16 నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతుండడంతో స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు అఖండదీపారాధన వెలిగించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు. సంక్రాంతి పండుగ నుంచి సట్టెడు వారాలు (ఉగాది) వరకు జాతర జరుగుతుంది.

పక్క రాష్ట్రాల నుంచి భక్తులు

ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా భక్తులు హైదరాబాద్, రంగారెడ్డి, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు సమర్పించుకుంటారు. దేవాదాయశాఖ అధీనంలో ఆలయం ఉన్నప్పటికీ పాలకమండలిని ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. జాతరకు వచ్చే వేలాది మంది భక్తజనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉంది. గతంలో భక్తులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈసారి నిర్వాహక కమిటీ ఏర్పాటు చేయాలి. తాగునీటి ఇబ్బందులు తలెత్త కుండా వైద్య, పోలీస్ శాఖల సహకారంతో శిబిరాలు ఏర్పాటు చేయాలి.

అఖండ దీపారాధన



డిసెంబర్ 16 నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతున్నందున జాతర ప్రారంభమవుతోంది. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. దాతల సహకారంతో ఆలయం వద్ద పలు అభివృద్ధి పనులు చేపట్టాం.

– ధనుంజయ్యశర్మ, ప్రధాన అర్చకులు

ఏర్పాట్లు పూర్తి



జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటి సదుపాయాలతో పాటు వైద్య శిబిరం, వలంటీర్లతో భక్తులకు దర్శనం ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– శశిధర్‌గుప్తా, ఆలయ ఈఓ

ఆధ్యాత్మికత చింతన అవసరం

సిద్దిపేట్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సునీతారెడ్డి తదితరులు

తూప్రాన్: ఆధ్యాత్మిక చింతన అవసరమని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప దేవస్థానంలో నిర్వహించిన అయ్యప్పపడి పూజకు ఎమ్మెల్యే హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మాసాయిపేటను అభివృద్ధి చేస్తా



108 వాహనాన్ని ప్రారంభిస్తున్న రాజిరెడ్డి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మాసాయిపేట మండలానికి నూతనంగా మంజూరైన 108 అంబులెన్స్ వాహనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారి 44పై తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా 108 వాహనాన్ని ప్రభుత్వం మంజూరు చేయడం హర్షనీయమన్నారు. త్వరలోనే మాసాయిపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింలు, 108 జిల్లా మేనేజర్ జనార్దన్, హరీశ్, వినోద పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్ 2 పరీక్షలు



నర్సాపూర్‌లో నోటీసు బోర్డుపై హాల్‌టికెట్ నంబర్లను చూస్తున్న అభ్యర్థులు



అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ, ఇన్‌చార్జి సీఐ తదితరులు

నర్సాపూర్: పట్టణంలో గ్రూప్– 2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో గ్రూప్– 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణను ఆర్‌డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్‌లు పర్యవేక్షించగా ఇన్‌చార్జి సీఐ వెంకటరాజగౌడ్, ఎస్ఐ లింగంలు బందోబస్తు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షకు ఐదుగురు అభ్యర్థులు పది నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారిని నిబంధనల మేరకు వారిని లోపలికి అనుమతించలేదు.

సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీ కమిటీ ప్రతినిధులు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులోని వెంకటేశ్వర కాలనీలోని సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. ఆదివారం కాలనీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాలనీలో మురికి కాల్వలు, సీసీరోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, కాలనీకమిటీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు బాల్‌రెడ్డి, కాలనీ కమిటీ ప్రతినిధులు నర్సింలు, రమేశ్‌గౌడ్, బుచ్చానాయక్, ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌నాయక్ సమావేశంలో ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, కాలనీకమిటీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు బాల్‌రెడ్డి, కాలనీ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.పాల్గొన్నారు.

విరాళాలు సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

చిలప్‌చెడ్(నర్సాపూర్): సంగారెడ్డి పట్టణంలో వచ్చే ఏడాది జనవరి 25 నుండి 28 వరకు నిర్వహించే సీపీఎం 4వ మహాసభల జయప్రదానికి విరాళాలు సేకరిస్తున్నామని సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. ఆదివారం ఆయన చిలప్‌చెడ్ అజ్జమర్రి గ్రామంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం జాతీయ గుర్తింపు కలిగి, నిరంతరం పేదల, కార్మికుల, ఉద్యోగుల, కష్టజీవుల హక్కుల పోరాడుతుందన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక విధానం, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న పార్టీ సీపీఎం అన్నారు. జిల్లాలో మంజీర జలాలు, సాగు, తాగునీరు, పోడు భూములు, కనీస వేతనాలు తదితర వాటి గురించి సీపీఎం ఎంతగానో పోరాడిందన్నారు. మహాసభలకు భారీగా విరాళాలు ఇవ్వడంతో పాటు, భారీగా ప్రజలు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి నాగరాజు, నాయకులు శేఖర్, నర్సింలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి



హోమం చేస్తున్న సద్గురు జ్ఞానేశ్వర్



పెద్దశంకరంపేట(మెదక్): దేవాలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని అనంత పద్మనాభస్వామి గుట్టపై ఆదివారం దత్త జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా దత్తాత్రేయస్వామి, బూమినాథం మహారాజ్ చిత్రపటాన్ని ఊరేగించారు. దత్తాత్రేయస్వామి, అనంత పద్మానాభ స్వామి, గణపతి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆశ్రమ అచల బోధనంద మహారాజ్ విగ్రహ ఆరాధన, పాదుక పూజ, వేద పండితులు సంగమేశ్వర వేదమంత్రోచ్ఛరణల మధ్య జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో కామదేనువు హోమం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అనంతపద్మనాభస్వామి ఆశ్రమ నిర్వాహకులు జ్ఞానసంద జ్ఞానేశ్వర్ మహారాజ్ పాల్గొని భక్తులను ఆశీర్వదించారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో దత్తజయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సంతోషిమాత ఆలయంలో, మాణిక్ ప్రభు దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, దీపారాధన చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామానికి చెందిన చాకలి కనకయ్య, బొల్లు మల్లయ్యలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మానస్ రంజిత్, నాయకులు బాల్ నర్సాగౌడ్, రామస్వామి, బుచ్చులు, కిషన్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి రెండు అంబులెన్సులు

నర్సాపూర్: నియోజకవర్గానికి రెండు 108 అంబులెన్స్‌లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన జిల్లా సమావేశంలో నియోజకవర్గంలోని కొల్చారం, వెల్దుర్తి మండలాలకు 108 అంబులెన్సులు మంజూరు చేయాలని తాను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మను కోరానని ఆమె చెప్పారు. కొల్చారం, వెల్దుర్తి మండలాల్లో అంబులెన్స్‌లు లేనందున ప్రమాదాలు జరిగి క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన దృష్టికి తీసుకుపోయాయని అన్నారు. దీంతో మంత్రి స్పందించి రెండు అంబులెన్స్‌లు మంజూరు చేశారని వివరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శివ్వంపేట(నర్సాపూర్): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులు కాంట్రాక్ట్ విధానంలో విధులు నిర్వహిస్తున్నారని వారిని రెగ్యులరైజ్ చేయాలని, పేస్కేల్ ఇవ్వాలని కోరుతూ కొన్ని రోజుల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగులను చర్చలకు పిలిచి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

గజ్వేల్‌రూరల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. గ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్‌తో కలిసి ఆదివారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలను అందించనుందని, సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నరేశ్, సాహెద్, యాదగిరి, అజ్గర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణంలో జాప్యం ఎందుకు ?



హవేళిఘణాపూర్ రోడ్డు పక్కన తీసిన గుంత

- నెల రోజుల తరబడి నిలిచిన జాతీయ రహదారి పనులు
- హవేళిఘణాపూర్ వద్ద డ్రైనేజీ గుంతలు తీసి వదిలేసిన వైనం



రోడ్డు వేసేందుకు కంకర పోశారు..

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ నుంచి ఎల్లారెడ్డి వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం హవేళిఘణాపూర్ వద్ద ఓ పక్క డ్రైనేజీ నిర్మాణం కోసం గుంతలు తీసి కేవలం బెడ్‌పోసి అలాగే వదిలివేశారు. దీంతో రాత్రి వేళల్లో గుర్తించక అందులో పడి ప్రాణాలు పోయే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నెల రోజుల క్రితం తీసిన గుంతలు ఇంత వరకు పనులు చేపట్టకుండా జాప్యం చేయడం వల్ల ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా హవేళిఘణాపూర్ శివారులో రోడ్డు నిర్మాణం కోసం కంకరపోసి అలాగే వదిలివేశారు. అందులో నుంచి ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనం అదుపుతప్పి కిందపడితే ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు వేస్తామని నెలల తరబడి అలాగే ఉంచితే అమాయకుల ప్రాణాలుపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి పనులు త్వరగా పూర్తి చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరుతున్నారు.

చిరస్మరణీయుడు వల్లభాయ్ పటేల్

గజ్వేల్‌రూరల్: భారతదేశ తొలి ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచారని పలువురు హైందవ సోదరులు కొనియాడారు. పటేల్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పటేల్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పౌర్ణమి పూజలు



శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖీ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో హరిద్వార్చన, విశేష పూజలు, మహామంత్రహవనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్నదానం చేశారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం మండలంలోని చిటుకుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులు అమ్మవారి దర్శించుకున్నారని, ఇందులో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం ఉదయం దేవాదయశాఖ ఉమ్మడి జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్, విఘ్నేశ్ నల్లపోచమ్మకు పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించడంతో పాటు వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు